వేసవి దుక్కు.. లాభాల దక్కు

- తొలకరి వర్షాలకు ముందే దుక్కులు మేలు
- పచ్చిరొట్టతో పెరగనున్న భూసారం
- సలహాలు పాటిస్తే మెరుగైన దిగుబడులు

వేసవిలో దుక్కి దున్నడాన్ని రైతులు వృథా ఖర్చుగా భావిస్తుంటారు. దీంతో వేసవి పంటల కోతల తర్వాత మళ్లీ వర్షాకాలం వచ్చే వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తుంటారు. కానీ.. వేసవి దుక్కుల వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని, కర్బన శాతం, నీటిని నిలుపుకొనే శక్తి పెరుగుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.


అందుబాటులో ఎరువులు


అరబుపాలెంలో ఎడ్లతో దుక్కులు చేస్తున్న దృశ్యం

మునగపాక: వర్షాధార భూముల్లో సకాలంలో విత్తనాలు వేస్తేనే ఆశించిన పంట దిగుబడులు లభిస్తాయి. వర్షాలు కురవడం మొదలైన తర్వాత నేలను తయారు చేయడం ప్రారంభిస్తే భూమిలోని తేమ వృథా అవడమే కాక తగిన సమయంలో విత్తనాలు వేయలేకపోవచ్చు. వేసవిలో భూములను దున్నుకుంటే వర్షాలు పడిన తర్వాత అదునులో తగినంత తేమ ఉన్నపుడు విత్తనం వేసుకోవచ్చు.

వర్షాలకు ముందు దుక్కులు చేయాలి

రైతులు వేసవిలో దుక్కులు చేసుకోవడం మంచిది. వర్షాలకు ముందుగా దుక్కులు చేసుకోవడం వల్ల పంటల దిగుబడులు ఆశాజనంగా ఉంటాయి. సాధారణంగా వర్షాధార భూముల్లో ఖరీఫ్, రబీ పంట తర్వాత మరలా వర్షాలు వచ్చేంత వరకు రైతులు దుక్కులు చేయకుండా వదిలేస్తుంటారు. ఇలా చేయడం వల్ల భూమి లోపల పొరల నుంచి నీరు ఆవిరైపోతుంది. కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి నేలలో సత్తువ లేకుండా చేస్తాయి. వేసవిలో మే నెలలో అడపాదడపా కురిసే వర్షాలను సద్వినియోగం చేసుకొని పొలాలను దున్నుకోవాలి. వర్షాలకు ముందే భూమిని దున్ని ఉండడం వల్ల తొలకరి వర్షాలు పడగానే మట్టి పెళ్లలు మెత్తపడి నీరు భూమిలోకి ఇంకుతుంది. తర్వాత విత్తన మొలక శాతం బాగుంటుంది.

వేసవి దుక్కులపై దృష్టి సారించాలి



ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుతున్నాం. రైతులు వేసవి దుక్కులపై దృష్టి సారించాలి. ముందుగా పచ్చిరొట్ట విత్తనాలను వేయడం వల్ల భూసారం పెరుగుతుంది. తద్వారా మెరుగైన దిగుబడులకు అవకాశం ఉంటుంది. పంటల సాగులో మంచి ఫలితాలు సాధించాలంటే తప్పనిసరిగా అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

–సీహెచ్ జ్యోత్స్నకుమారి, ఏవో, కశింకోట

వేసవి దుక్కుల వల్ల ప్రయోజనాలు ఇలా...

- వేసవి దుక్కుల కారణంగా కలిగే ప్రయోజనాలపై రైతులు దృష్టి సారించాలి. వేసవిలో వాలుకు అడ్డంగా, లోతుగా దున్నుకోవడం వల్ల వర్షపునీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి.
- భూమి ఎక్కువ తేమను గ్రహించి దానిని నిలువ చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకుంటుంది.
- నీటి పరివాహక ప్రాంతాల్లోని భూముల్లో వేసవిలో వాలుకు అడ్డంగా దున్నడం ద్వారా భూమి కోతను నివారించవచ్చు. భూసారం కొట్టుకుపోకుండా కాపాడవచ్చు.
- వేసవి దుక్కులు చేసే ముందు పశువుల ఎరువు లేదా చెరువు మట్టిని వెదజల్లడం ద్వారా నేల సారవంతమవుతుంది. భూమిలో తేమను నిలుపుకునే శక్తి పెరుగుతుంది.
- వేసవి దుక్కు చేసిన తర్వాత వీలైన ప్రాంతాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూసారం పెరుగుతుంది.
- వేసవి దుక్కులు చేసే ముందు పొలంలో ఆవులు, గొర్రెలు, మేకల మందలను వదలడం వల్ల అవి విసర్జించే మల, మూత్రాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థం పెరుగుతుంది. తద్వారా భూసారం అభివృద్ధి చెందడమే కాకుండా ఆ తర్వాత వేసే పంటల్లో సూక్ష్మ పోషక పదార్థ లోపాలను నివారించుకోవచ్చు.
- నేల పైపొరలో గాలి శాతం పెరుగుతుంది. దీని వల్ల సూక్ష్మ జీవుల సంఖ్య పెరుగుతుంది. ఈ సూక్ష్మ జీవులు నేలలోని సేంద్రియ పదార్థం త్వరగా కుళ్లడానికి దోహదపడుతుంది.
- కలుపు విత్తనాలు అధిక ఉష్ణోగ్రతకు లోనై నశిస్తాయి.
- తొలకరి కంటే ముందుగానే వేసవి దుక్కులు చేయడం వల్ల భూమిలో ఉన్న కోశస్థ, గుడ్లు దశలు బయటపడి అధిక ఉష్ణోగ్రతకు గురై చనిపోతాయి.

క్లుప్తంగా

ధ్యానంతో ఆరోగ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ధ్యాన గురువు వనజ పేర్కొన్నారు. నాగులాపల్లి చంద్రశేఖర్ మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బుద్ధ పౌర్ణమి సందర్భంగా సోమవారం ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ధ్యానం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఎటువంటి అనారోగ్యం దరిచేరదన్నారు. రోజులో కొంత సమయాన్ని ధ్యానం కోసం కేటాయించాలన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

మునగపాక: స్థానిక బీసీ కాలనీకి చెందిన కొణతాల కొండలరావు(58) అదృశ్యంపై కేసు నమోదైంది. గత నెల 29న సాయంత్రం 4 గంటల తర్వాత మద్యం తాగి ఎక్కడికో వెళ్లిపోయాడు. నాటి నుంచి కొండలరావు ఆచూకీ లేకపోవడంతో కొండలరావు కుమారుడు నరేష్ మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పింఛన్ల విధుల నుంచి మినహాయించాలి


ఎంపీడీవో ప్రభాకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అచ్యుతాపురం రూరల్: సామాజిక పింఛన్ల విధుల నుంచి మినహాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ఎంపీడీవో ప్రభాకరరావుకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే అనేక యాప్‌ల భారంతో సతమతమవుతున్నామన్నారు. ఇటీవల గుంటూరులో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అంగన్‌వాడీ కార్యకర్త సస్పెండ్ అయినట్లు వాపోయారు. తమ బాధలు అర్థం చేసుకుని పెన్షన్ డ్యూటీ నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నాయకులు నారాయణమ్మ, అంబిక, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ


రమణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు

ఎస్.రాయవరం: ప్రమాదాలకు గురైనప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమైన సకురు రమణను సోమవారం ఆయన పరామర్శించారు. ఇబ్బందులు ఉన్నప్పుడు అధైర్యపడకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, నాయకులు వియ్యపు వరహాలు, చొప్పా రాజు, వియ్యపు పోతురాజు, రమణ మాస్టార్, కొంగ్ర రమణ పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల నిరసన


కోటవురట్ల సీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

కోటవురట్ల: స్థానిక సీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తలు సోమవారం నిరసన చేపట్టారు. అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో స్టాఫ్ నర్స్ సరళ కశింకోటకు చెందిన ఆశ కార్యకర్త మాధవిపై చేయిచేసుకోవడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దురుసుగా ప్రవర్తించిన స్టాఫ్ నర్స్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఎండనక, వాననక గ్రామాల్లో కష్టపడి పనిచేసే ఆశ కార్యకర్తలపై చిన్నచూపు తగదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

80 మందికి నేత్ర పరీక్షలు


కంటి పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ తదితరులు

ఎస్.రాయవరం: మత్స్యకారుల్లో ఎక్కువగా కంటి సమస్యతో బాధపడుతున్నారని సర్పంచ్ మల్లే లోవరాజు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన హైమా నేత్రాలయం ఆధ్వర్యంలో కొత్తరేవుపోలవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 80 మంది రోగులను ఆప్తాలమిస్టు పరీక్షించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున, అప్పలరాజు తదితరులు సహాయ సహకారాలు అందించారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాలు


వెంకన్న ఆలయానికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: ప్రతి ఒక్కరూ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక బైపాస్ రోడ్డులో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మునగపాకకు చెందిన పెంటకోట వైకుంఠ బలరామ్ కృష్ణ కుమారుడు శ్రీనివాసరావు, మహలక్ష్మమ్మ దంపతులు రూ.50,116, మంగళవరపుపేటకు చెందిన ఆడారి మోహన్ సోదరులు రూ.50,116 వంతున విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో పెంటకోట ఆదినారాయణ, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి అచ్చియ్యనాయుడు, కోనపల్లి రామ్మోహనరావు, పొలిమేర కృష్ణ, మొల్లేటి సత్యనారాయణ, వెలగా శ్రీనివాసరావు, పెంటకోట నాయుడు, విల్లూరి మోహన్, పెంటకోట సతీష్, బొడ్డేడ రామనాయుడు, విల్లూరి నూక నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

పైడమ్మకు నాగాభరణం బహూకరణ


పైడమ్మ ప్రతిమకు అలంకరించిన నాగసర్పం

ఎస్.రాయవరం: కొరుప్రోలులో పైడిమాంబకు అంగా సత్తిబాబు దంపతులు సోమవారం 5 కేజీలు నాగాభరణం బహూకరించారు. రూ.20 వేలతో వీటిని తయారు చేయించి అలంకరించారు. ఈ సందర్భంగా శాస్త్రోకంగా పూజలు చేశారు. సతకం పట్టు వద్ద అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి జాతర పురస్కరించుకుని రాత్రికి ఉయ్యాల స్తంభాలు ఏర్పాటు చేసి అమ్మవారి గరగలను ఊరేగించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి చీర, సారె, పసుపుకుంకుమలు సమర్పించేందుకు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

రేవుపోలవరంలో నేడు బంగారమ్మతల్లి జాతర..
మత్స్యకార గ్రామాలైన రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాల్లో మంగళవారం బంగారమ్మ తల్లి జాతర నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.

దార్లపూడిలో అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం..
మేజర్ గ్రామ పంచాయతీ దార్లపూడిలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన పంటలు


విత్తనాల కిట్లను రైతులకు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

మాకవరపాలెం : రసాయనాలు లేకుండా చేపట్టే ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన పంటను పొందొచ్చని వ్యవసాయశాఖ పాయకరావుపేట ఏడీ ఉమాప్రసాద్ అన్నారు. మండలంలోని కొండల అగ్రహారం రైతుసేవా కేంద్రం వద్ద ఈ గ్రామంతోపాటు మరికొన్ని గ్రామాల్లోని రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన నవధాన్యాల విత్తన కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సేద్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలను అందిస్తున్నాయన్నారు. ఎరువులు, పురుగుమందులు లేని సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో నవధాన్యాల విత్తనాల కిట్లను పంపిణీ చేసినట్టు చెప్పారు. మండల వ్యాప్తంగా 2700 మంది రైతులకు ఈ నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్నట్టు ప్రకృతి సేద్యం మండల ఇన్‌చార్జ్ కమిత తెలిపారు. ఎంపీపీ సర్వేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పాత్రుడు, ఎంపీడీవో ఛాయాసుధ, ఏవో చిరంజీవి, ఏపీఎం మంగ పాల్గొన్నారు.

హోటల్‌లో తనిఖీలు


హోటల్‌లో తనిఖీచేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

నర్సీపట్నం: ప్రచార మాధ్యమాల్లో వచ్చిన ఫిర్యాదు మేరకు నర్సీపట్నంలోని పాలిమర్ హోటల్‌లో తనిఖీలు చేశామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించామన్నారు. హోటల్‌లోని వివిధ రకాల ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించామని తెలిపారు. హోటల్స్ నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు కూడా పదే పదే మరిగించిన ఆయిల్ వినియోగించరాదని అన్నారు. ఫిర్యాదులు వచ్చినట్టయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రవాణా సమ్మె పోస్టర్ ఆవిష్కరణ


సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

పరవాడ: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగ డ్రైవర్లు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. లంకెలపాలెం కూడలిలో సమ్మె వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో రోడ్డు రవాణా రంగం కీలకపాత్ర వహిస్తోందన్నారు. ఈ రంగంలో ఆటో, మోటార్, బస్, లారీ, వ్యాన్లు ద్వారా ప్రయాణికులను, సరకులను చేరవేస్తున్నారన్నారు. ఇలాంటి రంగంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. దీనికి నిరసనగా సదరు కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాత వెంకటస్వామి, నరసింగరావు, ఠాగూర్, మధు, నరసింగరావు, రమణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక దోహదపడుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ హాలులో నిర్వహించిన పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, మండల ఇంజనీరింగ్ అధికారి గులామ్, ఉపాధి హామీ పథకం ఏపీవో శివ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యాపారులకు అవగాహన


సదస్సులో వ్యాపారులు

పాయకరావుపేట: పట్టణంలో వ్యాపారులకు సోమవారం లీగల్ మెట్రాలజీ విభాగం వారు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విశాఖ డిస్ట్రిక్ కంట్రోల్ ఆఫీసర్ రవికుమార్, అనకాపల్లి జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టరు డి.అనురాధ అవగాహన కల్పించి వ్యాపార సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కిరాణా వృత్తి సంఘం ప్రెసిడెంట్ శ్రీరామ్‌మూర్తి, సెక్రటరీ రాయపూడి జయప్రకాష్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ వాహనం సీజ్

ఎస్.రాయవరం: అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వాహనాన్ని ఆయిల్‌ను సీజ్ చేసినట్టు ఎస్ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. ఏపీ39 యుక్యూ 8406 అనే నెంబర్ గల ఆటోలో 500 లీటర్ల ఆయిల్‌ను అనధికారికంగా తరలిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఆయిల్‌ను మండలంలోని బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన జగ్గ నుంచి పసగొడుగుల అచ్చిబాబు కొనుగోలు చేసి తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అహింసే పరమ ధర్మం


బుద్ధుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బౌద్ధ సంఘాల ప్రతినిధులు

అనకాపల్లి: అహింసే పరమ ధర్మమని ప్రబోధించిన మహనీయుడు గౌతమ బుద్ధుడని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు తెలిపారు. స్థానిక నెహ్రూ చౌక్ వద్ద గౌతమ బుద్ధుడు 2,569 జయంతి పురస్కరించుకుని ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి సోమవారం పలువురు వక్తలు నివాళులర్పించారు.

అనకాపల్లి టౌన్: బుద్ధుడు చూపించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధి బల్లా నాగభూషణం కోరారు. పట్టణంలోని నెహ్రూ చౌక్ జంక్షన్‌లో బుద్ధుని 2569 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి ప్రార్థనలు చేశారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు


గణపర్తిలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

మునగపాక: ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబు హెచ్చరించారు. మండలంలోని గణపర్తి గ్రామంలో ఆక్రమణలకు గురైన పాకలను తొలగించే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.ప్రసాదరావు బందోబస్తు నిర్వహించారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. స్వచ్ఛందంగా పాకలు తొలగించి అధికారులకు సహకరించాలన్నారు. ఆర్ఐ పడాల్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిబిరం

యలమంచిలి రూరల్: పట్టణంలోని భవనం వీధి వేద పాఠశాలలో మంగళవారం నుంచి వచ్చే నెల 28వ తేదీ వరకు ఉచిత యోగా శిబిరం నిర్వహించనున్నట్టు గురువు మళ్ల రామ సూర్య అప్పారావు తెలిపారు. రోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగా శిక్షణ ఉంటుందన్నారు. ఈ ఉచిత వేసవి శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9247272807 సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అచ్యుతాపురం రూరల్: చోడపల్లి గ్రామంలో రూ.5 లక్షల ఎంపీపీ నిధులతో డ్రైనేజీ, సీసీరోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు చోడపల్లి సర్పంచ్ భాను వెంకట్ సోమవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

రాయితీపై సమీకృత పశు దాణా పంపిణీ


బి.కె.పల్లిలో సమీకృత దాణాను రైతుకు అందిస్తున్న దృశ్యం

కోటవురట్ల: సమీకృత దాణాను రాయితీపై అందిస్తున్నామని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టరు పెట్ల నరేష్ కోరారు. సమీకృత దాణా పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ మండలానికి 10 టన్నుల సమీకృత దాణా రాగా, రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. పశు సంవర్ధక శాఖ ద్వారా రూ.1100 విలువ చేసే 50 కిలోల సమీకృత దాణాను 50 శాతం రాయితీ పోను రూ.550కు అందిస్తున్నామని తెలిపారు. రాయితీపై ఒక్కొక్క పాడి పశువుకు 90 రోజులకు గాను 150 కిలోల దాణాను అందిస్తున్నామని, గరిష్ఠంగా ఒక రైతుకు మూడు పశువులకు రాయితీపై దాణా అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

నీతి కథల అభ్యసనంతో మంచి నడవడిక


నీతి కథల గురించి ఉద్బోధిస్తున్న డైట్ విద్యార్థిని


గ్రంథాలయంలో సమ్మర్ క్లాస్

అచ్యుతాపురం: నీతి కథలను చదవడంతో పాటు, వాటి అర్థాలను, వాటిలో దాగి ఉన్న నీతిని గ్రహించాలని డైట్ విద్యార్థిని వరలక్ష్మి తెలిపారు. వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆమె విద్యార్థులకు నీతి కథలను వినిపించారు. రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి విద్యార్థులతో మమేకమయ్యారు. అంతే కాకుండా వారికి తెలిసిన నీతి కథలను చెప్పించారు. తద్వారా నీతి గురించి అవగాహన కల్పించారు. చిన్నారులు గ్రంథాలయాల్లో ఉండే పుస్తకాలను చదవాలని, ఎన్నో చరిత్ర ఘట్టాలు, పురాణాలు మన నడవడిక ఎలా ఉండాలో నేర్పేలా కథలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథలయాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలు చెప్పుట, రాయించుట, తెలుగు వ్యాకరణం చెప్పారు. అనంతరం వీక్లీ పోటీలు ఏర్పాటు చేశారు. సీనియర్స్‌కి ఇండియా, పాకిస్థాన్ ఆపరేషన్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్స్‌కి లెమన్ స్పూన్స్ పోటీలు ఏర్పాటు చేశారు. యోగా నేర్పించారు. 25 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణ్‌రావు తెలిపారు.

25లోగా మైనారిటీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి


షేక్ ఉన్నీసా

మాడుగుల : ప్రభుత్వం మైనారిటీలకు అందిస్తున్న 50 శాతం రాయితీపై రుణాలు పొందడానికి ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ మహిళా జనరల్ సెక్రటరీ షేక్ ఉన్నీసా తెలిపారు. సోమవారం స్థానిక గాంధీ పార్కువద్ద ఆమె సాక్షితో మాట్లాడారు మైనారిటీ వారు బీసీ ఈ కేటగిరిలోను,ఇతర మైనారిటీవారు సిక్కులు, బౌద్ధులు, జైన్‌లు, పార్శికులు, ఓసీ కేటగిరిలోను దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి స్వయం ఉపాధి పథకం ద్వారా మైనారిటీల వారికి లక్ష నుండి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్ మైనారిటీలకు రూ.లక్ష నుండి రూ.5 లక్షల వరకు 50 శాతం సబ్సిడీపై రుణాలు అందజేస్తారన్నారు.

కార్మిక చట్టాలు నిర్వీర్యం చేయొద్దు

నర్సీపట్నం: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రాన్ని అందజేసారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు. డబ్బులు రాకపోవడంతో ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ కూలీలకు జీవించే హక్కును కల్పించేందుకు ఉద్దేశించిన ఉపాధి హామీ చట్టం పారదర్శకంగా అమలు చేయాలన్నారు. చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు, గొల్లు గురుబాబు, ఎస్.కొండలరావు పాల్గొన్నారు.